# మణిదీపాలు

ఇంకా ... బాగా చీకటి పడలేదు. పార్కులో కూచున్నాను; నా పక్కను ... వచ్చి బెంచీ చివర చదికిలపడ్డాడు...

అరవై ఉంటాయా? అన్నీ ఉడిగాయా ... అయితేనేం ... అలా మాటి మాటికీ మీసంమీద చెయ్యి ... అదే నాటిదో అలవాటా? ...

పిలుస్తూంది ఎవరో అమ్మాయి ... పిల్లను చంకనెత్తుకుని ... కనబడుతూ ఎదురుగా దూరంలో నిలుచుని;

తలవంచుకుని తదేకదీక్షగా పేపరు చదవడం అప్పుడు మొదలు పెట్టాడు; కాళ్ళ పాంజేవులు చప్పుడు చేసుకుంటూ వచ్చి ... కళ్ళముందర నిలచి గదమాయించింది. 'ఎవరమ్మా - నీవు' అన్నాడు వెలా తెలా పోతూ - ఏమీ ఎరుగనివాడిలాగ.

'ఎవరా - ఏదీ నావంక చూసి మాటాడండి? ఎవరా అనేకాడికి వచ్చిందీ - ఎంతమంది నిలా గొంతుకోసి, నిలువునా గంగలో దోశారు - ఏం మాట్లాడరేం? -'

ఏం మాట్లాడుతాడు పాపం! ఏలా పసిపట్టారో - ఏదో తమాషా జరుగుతూందని నాలుగు మూలలనుంచీ మూగుతున్నారు, వాళ్ళూ వీళ్ళూ.

'ఏం - ఉలకరేం - పలకరేం? -'

బెల్లంకొట్టిన రాయిలాగా బెంచీకి అతుక్కుపోయి ఊరుకున్నాడు.

'ఏమండీ బాబూ - నాకు అన్నలాంటివారు - తమ్ములాంటివారు ... అందరూ. బిడియం విడిచి అడుగుతున్నాను - ఏం న్యాయమో మీరే చెప్పండి - !'

అందరి మనసుల్లోనూ అదే ప్రశ్న - 'ఏమిటి, అసలు సంగతి?' - అన్ని కళ్ళల్లోనూ కనబడుతూంది. అన్ని గొంతులూ అడగడానికి ఊగుతున్నాయి ... అంతా ఓ నిమిషం నిశ్శబ్దం.

'ఏమండీ - ఎవ్వరూ అడగరేం నీ కిదేం బుద్ధని - యీ పెద్దమనిషిని? ...'

ఎవరికి వారికే యిరకాటంగా ఉంది - ఎదుటివాడు చొరవచేస్తే - ఎంత సేపన్నా నుంచుని చోద్యం చూడవచ్చును. కాని ...

ముందరికాళ్ళకి బందం పడ్డది. మొగాళ్ళందరికీ - 'మన కెందుకు, - మనసుకు నచ్చచెప్పకుంటున్నారు.

ఎగరోజుకుంటూ వచ్చింది - ఎవరో లంకిణి. - 'ఏమి పోయేకాలం యీ మొగచచ్చినాళ్ళకు' అని పనస చెబుతూ;

'ఏమే అమ్మాయి: - ఏమంటున్నారే' ఎవరికి వారు ప్రక్కకు తప్పుకుని దోవయిచ్చారు.

'ఏమంటారో నీవే అడుగు - నా తరం కావడంలేదు.'

'కావడం – లేదూ'

రెండు చెవులూ పట్టుకుని నిలవదీస్తుందేమో అనుకున్నాం – లేదు. – కాని – రోషంతో యింకా నిలువెడు పెరిగింది.

'ఏం – ఏమంటావు?'

'ముందు – నీ వెవరంటాను' – నదురూ బెదురూ లేకుండా నిక్కచ్చిగా అడిగేడు.

'నేను – ఎవరా – ?'

సాచి చెంప ఎగిరేట్టు కొడుతుందనుకుని – చెళ్ వినడానికి చెవులు దొరకించుకున్నాం – ఫ్చ – చప్పబడిపోతూంది. –

'అంతకాడికి – వచ్చిందీ? –

'వచ్చింది – యింకా వస్తుంది – ఇంక ఒక్క నిమిషం యిక్కడ నిలుచున్నావంటే – దవడ యెగురుతుంది – నా తడాఖా నీకు తెలుసుగా – పో – పోముందు –'

పేరుకు పోయిన మా మగతనమంతా – అయనలో ఫెళ ఫెళ లాడుతూంది – "భేష్" అనుకున్నాము.

"హుఁ – యిక నీ సంగతి ఏమిటి?" తల్లిని తగిలేసి – పిల్ల తల్లిమీద విరుచుకు పడుతున్నాడు – కళ్ళు కడవలుగా – వంచిన తల అలాగే ఉంచుకుంది –

"మంచివాణ్ణి కనక యింతటితో వదులుతున్నాను – డొక్క చించేసినా పాపముందా? ... ఉన్నాను, యిష్టం వచ్చినన్నాళ్ళూ. ఊరికే మంచం ఎక్కావా? ... ఉత్తచేతులతో యెన్నడన్నా వచ్చావా? ... ఏం ... నిన్నెవరు కడుపుతూండ మన్నారు? ... కన్నదానవు పెంచుకో – మానుకో ... ఈలాటి అలాయిదా సంతానాన్ని కూడా లెక్క వేసుకుంటే–యెన్ని రాజ్యాలకన్నా జనాభా యెక్కో దక్కో..."

(ఈ చివర మాట మా అందరితోనూ)

... కుక్కిన పేనల్లే వెళ్ళిపోబోతూంది,

"యింద!" ... గర్జించి ... యిన్ని రూపాయి నోట్లు పర్సులోంచి తీసి యిచ్చి ... "యివి పెట్టి పిల్లవాడికి ఏమన్నా కొనుక్కో"

... ఏమీ జరగనట్టుగా ... కూర్చుని మళ్ళా పేపరు చదువుకుంటున్నాడు ... యెవరి దోవను వాళ్ళు చల్లగా జారుకున్నారు ...

ఎంత గ్రంథసాంగుడో!

ఏళ్ళు మళ్ళుతున్నా, యింకా అంత చేవ యెక్కడిదో?

ఎక్కడెక్కడ ... యిలా, ఎందరుకొడుకుల్ని కన్నాడో, ఎన్ని వాడలు ఏలాడో? – ఏం మనిషి?

– నావంక చూస్తూన్నాడు – దోరగా, పరకాయించి; నవ్య సాహిత్య పరిషత్తయి కంపరించింది ఒళ్ళు; మరి, కలల్లో అయినా, అంత కామయ్యలం కాలేమే మనం;

ఎందరో మహానుభావులు ... అందరూ అతి వాళీగా అనే ముక్కలే, నేనూ మనసులో అనుకుంటూ, ఆ వాళ నిద్రపోయేదాకా అతని మాటే ... ఆ నిబ్బరమే తలుచుకుంటూ ... కలవరింతగా మేలుకుంటూ ...

– అరు నెలల పైమాట; ఆ ఊరుకాక, మరో ఊళ్ళో ...

అదే వేళ యించుమించు అంతమాదిరిదే పార్కు -

ఆయన వచ్చి ... నా పక్కను కూర్చున్నాడు.

... నన్ను ఆనవాలు పడతాడనుకునేందుకు వీలులేదు; యీ లోగా మలేరియాలో మునిగి తేలి, మనిషిని మారుకళ పడ్డాను. ఆ ఘనుడు రేజా మారలేదు.

పలకరిద్దామా! అని బుబలాటపడ్డాను ... కాని, తరువాత తీరా మాట్లాడేదేముంది? ... 'ఎవరు నీ'వంటే ఏమని చెప్పను? ... అప్పటి నాటకం ...

- అప్పటి నాటకం ...

అప్పటి పిల్లతల్లి కాదు ... మరొకతె ... మరొకతే ... కాని అంతా అప్పటి ... నాటకం.

అవే ... రమారమి డైలాగ్సు: అనాటి కన్న క్రిక్కిరిసిన ఆడియన్సు!

ఆయన ముందుసారి కన్న యింకా జోరుగా అభినయించాడు.

- తెర పడింది ... అలాగే తల వంచుకుని మళ్ళీ పేపరు చదవడంలో బడ్డాడు;

'తమ ... పేరు ...' అంటూ కొంచెం దగ్గిరకు సర్దుకున్నాను ధైర్యంగా;

... చదువుతూన్నది నింపాదిగా మడతవేసి, పెదవులు బిగించి, ఎగనెత్తిన కళ్ళతో నావంక ఎగాదిగా చూసి, చురచురగా గొంతు సవరించుకుంటూ ... "ఏం" అన్నాడు ఖంగ్‌న;

"... ఎప్పటికైనా - మీకు అఖండమైన సన్మానం చేయాలని సంకల్పం కలిగింది."

"ఏం?" - ఆ కనుబొమ లెగురుతున్నాయి.

"ఎంత గొప్పవారండీ మీరు; ఎందుకొచ్చిందిరా బాబా అని, పట్టపగ్గాల కోసం, పడుచువాళ్ళం అణగిమణగి అఘోరించుతూంటే ... ఏమీ - లేని - తనం దాచుకునేందుకు ఏం మజా అయిన ఎత్తు కనిపెట్టారండి? మీ మొగ - మనసుకు నమోవాకాలు..."

... రెడ్డిగంలో పడ్డకాలు తిమ్మిరి ఎక్కి ... ఊపుగా జాడించాను; నైట్‌క్వీన్ మొదలుకు తగిలి పట్టుకున్న తేనెటీగలు రేగి యిద్దరినీ చుట్టవేశాయి;

నేను తప్పించుకు యివతలకు దూసుకున్నాను. కాని ... పాపం ఆ అమాయకుడు, ధూకుడుగా ... చుట్ట ముట్టించడం కోసం అగ్గిపుల్ల గీశాడు.

## 2

అవాళ దీపావళి;

నిన్ననగా పట్టిన ముసురుకు కొండలన్నీ తడి ముద్దలైపోయినవి; కాస్త తెరపి యిచ్చినప్పుడల్లా, ఆకూ అలం, గజగజ లాడిపోతూంది.

ఆకాశం ధుమధుమ లాడిపోతూంది; పెనగొని క్రిక్కిరిసిన, కన్నె పడుచు కామ - కౌగిలింత, చిమ్మ చీకటి. ఏదో స్వర్గంలో ఉన్న ఏ బాలిశుడో ఎలుగెత్తిన సందడి, రోదసిలో నిశ్శబ్దపు ... రొద;

- పొదలో మిగిలిన జాజుల సందడి మాటు మణగింది -

- అవాళ దీపావళి.

... అనగనగా ఆ ఊళ్ళో, ఆ తోటలో, ఆ మూలగదిలో. వెలుగు అరసగి మూలుగుతూన్న నీడవారను, అలా ఠంచన్‌గా నిలుచున్న అబ్బాయి ఎవరు – ఎవరు వారు!

ఎవరు, నేనే;

నేనేనా – నేనా అబ్బాయిని? మా అబ్బాయికే గడ్డం పచ్చపట్టింది –

నా కోసం కాదీ కుర్రతనం; మీసంమీద చెయ్యి, పదేళ్ళ క్రితమే తీసివేశాను. నేను కన్నెత్తి చూడలేదని, ఆ అమ్మాయికి అనవసరంగా ముంచెత్తుకు వచ్చింది, రోషం –

– అందు కోసమని, పాపం, అందుకోసమని ...

... ఎవరి పాపమో ఠపీల్ – గా బద్దలౌతూంది – రజన్ ముద్దలు, మేడమీద నుంచి గచ్చుమీద త్రుళ్ళిపడి, రవ – చినుకులు హడలుగా చెల్లాచెదురౌతూన్నవి –

ఎందు కమ్మా నీకంత అందం, ఎన్నడూ ఎండకన్నెరుగని పడుచువు? ఎవరి నోరూరించను?

మునుపటిలాగా ఆదర – బీదరగా, నాకు, చక్కదనం సయించదన్న సంగతి, మీకు ఎందుకులే, తెలియడం! – నాకోసం మతాబాలు కలకల లాడించడం శుష్క దండుగ –

... వెలుగే కాదు, అవాళ నన్ను వెన్నెలే చేయలేకపోయింది మోసం –

అవాళ, దీపావళి –

కుంకుమపువ్వు ముదురుబారని చేను, ఆకాశం అంచుకు అనుకుంటూంది – వెన్నెల వేయందాల మెరసిపోతూంది – చీకటి మాటున, చిదిపితే శతకోటి దీపాలై వెలిగే ఆ అమ్మాయి, నన్ను పడవ – మేడలో "బందావైపోవా?" అని బ్రతిమాలింది; అలలు లేని గాలి తెప్పించుకుని, "అలాగే" అనమని, నన్ను ఎంతగానో లాలించినవి; ఉహూఁ ... నేను ఊగలేదు;

నవ్వు – నవ్వుకూ కళ్ళు జిగాల్ మనగా, ఆ అమ్మాయి సిగలో – చీకటిలో చూపులు దాచేసుకున్నాను;

ఆ పిల్లదే నాకు పెళ్ళామయితే – అమ్మయ్యో అంత వెన్నెలలో ఎల్లకాలమూ ఎల్లా వేగడం? – ఎన్నటికీ కాశ్మీరంలో అడుగుపెట్టకూడదనుకున్నాను.

... ఎంత సేపటినుంచో కురుస్తూంది వాన; జమ్ముకుపోయి, చినుకులు కునికిపాట్లు పడుతూన్నవి; గాలి ఝంయ్‌న బ్రతిమాలినా, వాన తెగ నీలుగుతూంది. గడ్డరితనంగా ఎడఎడంగా రాళ్ళంటి చినుకులు విసిరేస్తుంది.

చూసి చూసి ... దారీ తెన్నూ కనబడక, విసుగ్గా వెన్నెల, ఆ పూట కిహ నడుం వాల్చింది ...

అక్కడనుంచి, కదలదేం, ఆ అమ్మాయి?

... వదలి పెట్టేసి, అమాంతం వెళ్ళిపోయి, ఆ తరువాత ఎన్నడో మళ్ళా ఆరేళ్ళకు కనబడ్డాను, ఆఁఁఁ చిన్న దానికి; నన్ను చూసి, అదిరిపడ్డది .... "అమ్మాయ్, మీ అక్కయ్య ఎక్కడున్నది" అని చనువుగా పలకరించాను; మనసుతో వెక్కిరించి "అక్కయ్యను నేనే" .... అని పకాలుమంది ... కళ్ళమీద పంతంగా చెవుల రవలు మెరసిపోయినవి....

ఎరి, పాయ - పాయా నన్ను ఎంతో బలవంతంచేసింది. కాని నేనక్కడ ...దు .... ఆరేళ్ళు ముదిరిన ఆనాటి వెన్నెలను ... ఎందుకూ ఆ పూటకు ...ు తెచ్చుకోవడం! .... అలా అక్కడ ఎంతసేపు నిలుచుందో పాపం, అవాళ కోసం.

అవాళ దీపావళి ...

గూడు గూడుకూ ఒక జ్యోతి ... వాడలో, మేడల్లో నక్కిన చీకటులు రవరవలాడి పోయినవి.

ఆ పూట నేను, ఏదో రాజ్యం ఏలబోయినాను;

నడిరోడ్డుమీద చిచ్చుబుడ్డి ఝుంయ్మని నన్ను అక్కడే నిలవేసింది.

చిచింద్రీలూ, జిల్లీలూ, గంద్రగోళంగా రెచ్చిపోయినవి...అచ్చుపోసి ఏనాడో విడిచిన అంబోతు ఏదో, అల్లంత దూరాన అల - జడిగా బెదిరి, ఆ వాడమీద విరుచుకుపడ్డది ... నేను గోడవారకు ఒత్తిగిల్లాను.

ఆ పక్కను, ఓ రజన్ - పువ్వొత్తి అన్నీ రత్నాలుగా గుప్-న విరిసింది; ఆ మిడిసిపోటుకు "అమ్మో" అంది ఆకాశం ...

వెలుగుతో రోజే రజన్ కణ-కణలో, ఆ అమ్మాయి మొగం....పెద్ద ఆశాళ - కురుపు; కాని, ఆ కళ్ళల్లో కాలాంతకపు - కామదాహం...

కళ్ళు బరువుగా మూసుకు, బలవంతాన తెరిచాను; .... ఆ గుమ్మంమీదకు ఊరికే కాలు పెకలించుకుని ... అంబోతుకు ఎదురు నడిచాను.

... అది నన్ను చూసి బెదిరి ... మెత్తబడిపోయింది .... ఆ అమ్మాయి, బుసలుగా మరగే రజన్ - జేగురుకు కాకర - పువ్వొత్తి అంటించింది.

... నేను మలుపు తిరిగేదాకా, అక్కడ కాకరలు, కారాలూ - మిరియాలూ నూరుతూనే ఉన్నవి...

మరో మేడలో, చంద్రశాలలో .... సరే, ఆ అమ్మాయి సంగతి, అవాళ అసలు మరచేపోయినాను, అదీ వరుస ...

- నిదురకు మొగం - వాపుగా నీవు ఎందుకమ్మా అలా నిలుచుని జోగటం? వదులుగా అల్లిన ఐదు పాయల జడలో .... ఒక్క గులాబీ బిక్కు-బిక్కు మంటూంది; రేపు, వంకీజడ వేసుకో; దండిగా, పూలన్నా, అండగా ఉంటవి...

.... లేకపోతే, నీ మొగం, నీకు నామీదనటమ్మా, మమత?

పసిగోలవు: బ్రతిమాల నేర్చిన జాణవు కాదు; పగపట్టడమన్నా నేర్చుకో; పని వేళా కలలోకి రావలసిన బాధ తప్పుతుంది ... మీ ముదుసలికి ....

చలికే... నా గంద్రతనం వెక్కసమై ... కిక్కురు మనకుండా వణికి పోతూంది .... మొండికేసి కాసే ఎండకు, ముచ్చెమటలు ముంచెత్తుతూన్నవి.

.... ఉన్నవీ - లేనివీ ఊరూరా ఉన్న కన్నెలందరి మీదా ... లక్ష కల్పించి చెప్పినా, ఆ చిన్నది నన్ను అక్కడ, ఓ క్షణం నిలవేయలేకపోయింది...

"... సుందరివి, అవేం కళ్ళు? - కమలది అదేం నడక? ... సిగ్గు ఎంత మాత్రమూ లేదేం మీనాక్షికి?...."

"– అందరికీ లన్ని వంకలూ ఉన్నాయా? – అందుకనే కాబోలు నాకు అంత బాగుంటారు..." అనుకున్నాను.

"అయితే, మరి నేనో?" అన్నది చిన్నదానిమనసు....

"ఆ మాట, వేరే అడగాలా?" అన్నది నా నవ్వు...

"సుందరి పలువరుస, ధళధళ లాడదా? .... కమల – కమల చెక్కిళ్ళు ... ముద్దుకే ముద్దొస్తాయి ... అవునా కాదా? ..." అని గదమాయించాను. ఆ జడలో జాజులన్నీ ... "ఛా" నన్నాయి, మౌనంగా; సిగలో గొజ్జంగి మాత్రం రేక – రేకకూ పకాల్ మన్నది ... చెంపలకు దిగజారి, నన్ను కవ్వించింది ... కాని ... ఆ చిన్నది, నవ్వని – నాపచేను.

– అవాళ దీపావళి ...

ఆకాశం పొగలో .... అంత మేరలో పాపం, దిగులుగా, ఒంటరిగా, ఒక్కటే చుక్క ... అయితే నాకేం జాలి .... వాళ్ళ అక్కయ్యలందరూ ఎక్కడ దాక్కున్నారో, ఆరా తేలాలి....

అర్థమైందా అమ్మాయ్ .... (కాదులే, అసంగతులన్నీ నాకే అర్థం కావు) .... అయిపోయిందా బాణసంచా అంతా? .... అయితే పోయి, అమ్మమ్మపక్కలో పడుకో ... పాపాయ్....

## 3

వాడు బుకాయిస్తున్నాడు: ఆ రకం నాకు తెలుసును. అయినా ఎంతదూరం అలా గ్రంథ చౌర్యం జరుగుతుందో, కానీ చూద్దామని, ఊరుకున్నాను. అసలు ఆ ప్రసంగం ఎందుకు వచ్చిందంటే.....

అప్పుడే ... ఎవరో అమ్మాయిని రైలులో అటకాయించి దంపేశారు, పోలీసులు ... అసలు, మూల కారకుడు ... అది ఎలాగో పసిపట్టి ... అవతల వేపుకు దిగేసి ... అందకుండా ఎగబడ్డాడు; ఆ అమ్మాయిని ఆచూకీ చెప్పమని గద్దించుతూంటే .... అందరికీ చెక్కు చెదరకుండా అతి ధైర్యంగా – సమాధానాలు చెపుతూంది. అడిగే వాళ్ళకే సిగ్గు పుట్టుకు వస్తూన్నది ... అదంతా చిత్రంగా, చాలాసేపు అక్కడే నిలుచుని చూశాము – అందరమూ .... అంటే అయిదుగురము.

"అదీ ... అలా ఉండాలి, ఆడదంటే" అని ఒకడు; "అంటే యింటిలో పడి ఉండకుండా తగులుకు పోవాలనా?" అని ఇంకొకరు. "తపన చాలా మందికి ఉండవచ్చును. తగులుకుపోయేటంత ధైర్యం మరి?" అని మరొకడు.

"అసలు సంగతి ఏమైయుంటుందో?" అని అనుమానంగా నేను. "అది నా కొక్కడికే తెలుసును. వినాలని ఉందా, మీ కందరికీ?" అని సీరియస్‌గా – వాడు.

"ఆ అమ్మాయి మా మేనత్త కూతురు!"

అందరమూ అదిరిపడి ఒక్కసారి, వాడివంక చూశాము. వాడి ముఖంలో అబద్ధం చెపుతూన్న కవళిక యెవరికీ కనపడలేదు.

"అసలు నేను పెళ్ళి చేసుకోవలసింది.... కాని, అలా జరిగేందుకు వీలులేకపోయింది. ఆ కథంతా చెప్పాలంటే ఇప్పుడు తెమలదు. మూడు రోజులకు సరిపోయే గ్రంథమవుతుంది. ఏమైతేనేం మొగలు విరిచి ఒప్పించి, ఒక అభాజనుడికి

కట్టపెట్టారు. అప్పటినుంచీ ఇదీ వరుస. కనబడ్డ వానితోనల్లా, మూట కట్టుకు రైలెక్కుతుంది. సగం దోవలో పట్టుకువెనక్కు తీసుకు వెళతారు. ప్రయాణపు బడలిక తీరగానే, మళ్ళా మొదలు! ఇంతకూ వాళ్ళకు బుద్ధిలేదు. పోయేదాన్ని పోనీయరాదూ? ఉంచుకుని, బావుకునే దేముంది?"

"మరి....నీవు పలుకరించ లేదేం?"

"ఏ మొగం పెట్టుకుని? నేనంటే దానికి తగని అసహ్యం. నా మూలానేగా ఇలా అయిపోయింది. తననే మనసార వలచిన పడుచును, తండ్రి మాటలకు బెదరి, దక్కించుకోలేకపోయిన దద్దమ్మమీద ఆమెకు యెందుకు ఇంకా ప్రేమ, గౌరవం ఉండాలి? ఈ రంగంలోకి దిగిన తరువాత, ఇది మొదటిసారి కాదు, మేము తారసిల్లడం - చూసినప్పుడల్లా అభిమానధనుడైన గృహస్థు - అతని జాయే ఇలా చేస్తే, పడే అవస్థ కోటిగుణితంగా అనుభవించుతాను. అవును మరి, నిజానికి - కాలేకపోయినా - ఆమె నాకు మనసారా - భార్య."

"అయ్యో పాపం" అవి అంటున్నాయి అందరి మనసులూ. రెండు స్వీట్, రెండు హాట్ - అరగా అరగా కోకో, వాడికీ - అంత అపదలో ఉన్నందుకు అందరికీ తలో అరకప్పు టీ: అవతల ముగ్గురూ ఓ త్రోవ; మేం ఇద్దరమూ - ఇటూ! "బాగుంది కథ" అని పలుకరించాను. "నేను చెప్పడంలో కాదూ?" - "అసలు వ్రాసిన వాడికి ఏం గిట్టిందో కాని - అదే తిప్పి చెప్పి ... మన వాళ్ళచేత అయిదు అణాలు హోటలులో రాల్పించాను చూశావా? చేతనైతే నీవు కూడా ... అనవసరంగా కథలు వ్రాయడం మానేసి - చెప్పటం మొదలుపెట్టు - ఇప్పటికన్న ఎక్కువ గిట్టుబాటు అవుతుంది..." అన్నాడు ... కొంటెగా వాడు....

ఆ కథ వ్రాసింది నేను!

## 4

ఎప్పుడో ఏదో పారేసుకుంది - ఏమిటి?

దేనికోసమో వెదుకుతూంటుంది - దేనికోసం?

ఎవరో పాపం - అనుకుంటారు యెరుగనివాళ్ళు: చిన్నప్పుడు చూసినవాళ్ళు - అయ్యోపాపం - అనుకుంటూ ఒక్క నిమిషం అలా నిలవబడి పోతారు.

కనబడిన వాళ్ళనల్లా ఆ అమ్మాయే, నిలవేస్తుంది: కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తుంది: కనుపాపల్లో ఊగే దయ్యాన్ని చూసి, కెవ్వున కేక వేస్తుంది - అంతకన్న ఏమీ చెయ్యదు: అవతలి మనిషి జాలిగా నవ్వుకుంటాడు - యెవరూ కన్పించరు.

నవ్వుతూ ... పువ్వుల మీదకు దూసుకునే తూనీగలాగా - పిల్లల గుంపులో జొరబడుతుంది - ఎవ్వరూ బెదరరు: ఒకరికో యిద్దరికో, చెదరిపోయిన ముంగురులు దిద్ది ... తల నిమురడంలో... తాను కనలేని బిడ్డలందరూ, కలలన్నీ కడుపులో గణగణ లాడించితే ... అమాంతం ఎగిరి చెరువులో పడి ... ఆ మంటకు నీరంతా ఉడికేదాకా మునుగుతూనే ఉంటుంది - కలకలలాడే తామరలన్నీ మొగం చించుకుని జేవురించి కలవలైపోతాయి.

....నేను రాధను: నాథుని ప్రణయంలో పెరిగిపోయిన ముత్యాలహారంలో .... నా నీడ జాడ లేదేం – ? అంత తెలివిగల అమ్మాయి.... అలా అయిపోవడమునకు – అవతల ఎంతో గాధ ఉండాలా? – ఏమీ లేదని, ఎవరు చెపుతారు? – చెప్పేందుకు .... ఆ కళ్ళు ఒప్పుకుంటాయా? –

☆ ☆ ☆

కడుపుతూంది –

ఊరి వారందరిలోకీ – ఎవరా రాయుడు: ఏమీ ఎరుగని దానితో యెలా చెలగాటం ఆడాడు? – ఏ సామి యిచ్చినవరం? – గుండెమీద చెయి వేసుకుని – నేనే అనగలడా ఆ సామి? యెక్కడి దొంగలు అక్కడే ... వెర్రిది – వాడకట్టంతకూ వదినేనా? –

☆ ☆ ☆

అబ్బాయి....ఆ మూల ఆడుకుంటూ "అమ్మా" – అన్నాడు:

రాట్నం, ర్థయ్న తిప్పేసి, నిలిపి – రా నాన్నా! – అంది ....

"నాన్న–ఏడమ్మా" – తల రొమ్ములో దాచుకున్నాడు. కళ్ళనీళ్ళకు పందెంగా చనుబాలు ధారలైనాయి...

"నాన్న...." – "ఎవరు నేర్పారు నాన్నా నీకు ఆ మాట"

తల ఎత్తి తల్లివంక చూశాడు; ఆమె కళ్ళు మెరుపులుగా మాట్లాడు తున్నాయి; – "నాన్న – ఒళ్ళంతా కళ్ళు చేసుకుని – ఆ కళ్ళకోసమే అన్ని కళ్ళల్లోకీ చూశాను; – ఆ కళ్ళకోసమే...నిన్ను కన్నాను: కళ్ళతోనే కన్నాను – నాన్నా – వీళ్ళూ వాళ్ళూ లాగా కాకుండా –"

తల వంచుకుంటూ పసివాడు – "అమ్మా" అని ఆడుకునేందుకు మళ్ళా పరుగెత్తాడు: ఆరుబయలంతా తగని వెన్నెలగా ఉంది – అందులోనూ అక్కడా అక్కడా రెండేసి చుక్కలు – కళ్ళళ్ళే మెరుస్తూన్నాయి: ఆవేపు నిమిషమన్నా చూడకుండా – అబ్బాయిని గబుక్కున దగ్గిరకు లాక్కుని – ఆ కళ్ళేచూస్తూంది – హాయిగా: ఆకాశంఅంతా అమాయతో అయ్యో .... పాపంలాగా ఒక్కమారి ఆవలించి .... కళ్ళు మూసుకుంటుంది ....

దేనికోసం – వెదుకుతుంది ....

## 5

మాపంటే ... రేపంటే .... మళ్ళీ మావాళ్ళు వచ్చేస్తారు: ఇప్పుడే లోపలికి రమ్మంది లోలాకులపిల్ల –

అంటే – అదే మాటగా, పాటగా అనుకుంటూంటే .... ఏలా? – అప్పుడే రమ్మంటే –

ఆకూవక్కా వేసుకోవాలి ... అత్తరువు రాచుకోవాలి ... యింతకూ బిడియం దాచుకోవాలి ....

పోవాలీ? –

నిజంగా కావాలీ? – అయితే ...

మల్లెమొగ్గల పరువమంతా కొల్లలాడిన మందహాసము, పల్లవారుణ రాగరంజన మొల్లనన్నది – ఎందుకో?

రావాలీ? –

కలువరేకుల కలిమినంతా విలుచుకున్నవి కలికికన్నులు: జిలుగు వన్నెల కలలవెన్నెల నిలువ నన్నవి .... ఎందుకో –

ఎందుకో ... మరెందుకో? – అందుకే అయినా మరో అందగత్తె చేత కబురు లంపిన .... అందమూ చందమూ –

ఏల పిలువనంప తరలవేల చెలియ నాదరింప వేల మాయకాద! నిన్ననవేల లేమ నోము ఫలము? – అదేల?

ఏల విరులశయ్యా డాయవేల కూరుములు వేల కలువచలువ వెన్నెల రేల మోహనాంగినేల – వేల? –

యీ వరుసలన్నీ కరవైనా ... కామించా నన్నందుకు .... గరువానికి .... పరువానికి ....

మరచిపోనీయ వామనిరేలు నీ వగలు: కనులు తామరలతో కవలైనవి – ఇందుకే....

తలచి వచ్చానోయి, దరిజేరనీవోయి: లలనా జనాధునా తన మదన నీ హొయలు ....

పసికన్నె ప్రాయాన వసివాడలేనోయి ....

ఇక – చాల్చాలునోయి నీ మాయలు చాలు మానవోయి: యిన్ని వగలేల, నిన్ను నమ్మరాదోయీ: వేణుగాన మానిత వల్లవ మానవతీ మనోరమణ! .... ఇక చాలునోయి –

తేట వెన్నెలలో మనసైనదని కనుగీటకోయీ, మగనాలిని: నీటుకాడ మన కూటమి మాట తెలిసి నాతోటి చెలులు నవ్వే రిక చాల్ చాలునోయీ...

అనలేదో? .... అదే .... దేవునిమీద వాదుగా అనరాదో? .... ఆ ధోరణి ఏమీ చేతకాదో?

మరి....ప్రబంధాలు చదివిందే –

అయితే ....

పండబారి అన్నీ ఛీదాగా ఉడిగిన బెండపూడి అన్న మంత్రి తాహతు ఉండేనాడైనా కామదండు సిపాహి అవునో కాదో? –

రాతి నీతి భీమేశ్వర నాధుడు రాతిరి చీకటిలో భోగాల జాతి జాజిమంజరులు విరియగా ఏతామెత్తాడనడం – పుణ్యం!

అంగజభంగా అనేజపిత భస్మాంగుడు మాహేశ్వరుడు పవిత్రలింగధారి జంగము మల్లన్న నిజంగా అంగన మొక్కగా రింగురంగాగా – చూపు దోపిడి కాదా?–

తిక్క సోమయాజి నాన్నగారికి పక్కవేసినట్టి కుమ్మరమ్మాయ్ ఒక్కసారి ముచ్చటికె ఛప్పగా కుక్కిన పేనై కొడుకుఁ గన్నదా? –

తల్లి లేని అతుకూరివారి బుల్లి .... మొల్ల –

.... ఇక నోటికీ చేతికీ తిన్నగా వచ్చేట్టులేదు .... మరి, ప్రబంధాల పరమేశ్వరులకు అబ్బినవరాలు – నరాలకు పట్టి పోయినా .... జవరాలా ఏవే పూలసరాలు? –

యిచ్చేందుకు మన తాహతులో లేవే బన్నసరాలు ... గికి .... రాం రాం .... కానీ లేనప్పుడు .... లేనిపోని ఊహలు....

పోనీ .... పద్దెనిమిది వర్ణనలూ పెట్టీ, యిద్దరినీ ఎంత హెచ్చవేస్తే – ఎనభైనాలుగు? .... ఏమా మూలుగు! – నీలిగితే .... తాపం తగ్గకపోగా .... కోపం వచ్చిందంటే...కోయిల కూసినా మచ్చ మాసిపోదు: ఇది చాందు? .... ఏమిటి లోపం? ....

పాపం, లోపలికి రమ్మంది – ఆ – లోలాకుల పిల్ల: .....

## 6

"నిజమేనా?" .... "ఏమిటి?"

'అదే' 'అదే అయితే....నిజం కాదు'

'అబద్ధం' – 'అంతే – మీ రన్నది – అవతల వాళ్ళు అన్నవి!' 'వాళ్ళకేం, కళ్ళు పోయినాయా' 'ఏమో, చూసి ఓర్వలేకపోతే' 'మీరు చేసే .... ఘనకార్యానికి'

'అవును, ఎంత ఘనం! .... అందులో, నాగరాజును ఉంచుకోవడం అంటే' మాటలతో ఉందా?'

'మూట వదలుతూంటే .... కొండమీద కోతి అయినా దిగి వస్తుంది.'

"లేదు .... ఖర్చు ఎక్కువైన కొద్దీ .... కోతులు కొండమీదికి ఎక్కుతున్నాయి...."

"అనండి .... యింకా అనండి .... నన్ను కోతిని చేసే మీరిలా ఆడిస్తున్నారు. రేపీపాటికి ... మిమ్మల్ను" అదీ ....

"అంత ఖరీదైన పదార్థాన్ని – అదీ – అని తేలికగా తీసివేయ కూడదు .... ఆవిడ – అంటే యింతలో మునిగిపోయేదేమీ లేదు."

"అన్నింటికీ తెగించారు....ఇక మీకు పోయేదేముంది."

'లేదు – నిజం....' 'యిన్ని యేళ్ళు వచ్చినా మీకు ఎందుకు ఉండదరంట .... బుద్ధి?' – 'ఉంది: – ఉండవలసినదానికన్న ఎక్కువగా ఉంది: ఎలాగో చెప్పనా? – చెపితే నీకు కోపం రాకుండా ఉంటే –' 'వచ్చినా మీకు పోయే దేముంది?' – 'డబ్బు!' – 'అంతేనా?' – 'అది చాలదూ? – చెప్పనా? నేను బి.ఏ. దాకా లెక్కలూ, ఎం.ఏ. లో ఎకనామిక్సూ! అంతవరకూ తెలుసును కద! .... జీవితంలో కూడా .... అవే అడుగడుగుకీ అడ్డం తగిలి నన్ను దిద్దుతూంటాయి. అందుచేత ... లెక్క తప్పదు .... నేను చెడిపోవడానికి, వీలులేదు...'

'లెక్కలంటాయి 'నీ జీవితంలో ఇదిగో యింత మాత్రం దుబారా చేసినా ఫరవాలేదు....అంతకన్న ఎక్కువ పిగలదు....' అని ఆ పైకాన్ని అయిదుపెట్టి హెచ్చవేసినా....నాగరాజును, ఒక్కరాత్రికి కొనుక్కోలేను, .... ఇక, ఉంచుకోవడం మాటవస్తే .... నాకు మూడేళ్ళ ఆదాయం .... దానికో నెల జీతం .... అవును దానికి ప్రస్తుతం అంత ధర పలుకుతూంది: ఆ చౌదరయ్య .... అలాగే

చెల్లించుకుంటున్నాడు,..... అందువల్ల....ఎక్కడో ఆకాశాన్నంటుకు ఉంది: మనలాటి వాళ్ళకు...మక్కువ ఉన్నా, అందదు...ఏమిటి చేయడం? –'

"–ఇకనామిక్స్...సలహో చెపుతాయి కదా – "ఏదైనా, చివరకు దేహ బాధ తీర్చుకోవడం క్రిందికే వస్తుందికదా? అలాటప్పుడు....కొత్తమొగాల కోసం అనవసరంగా డబ్బు తగులవేయడం ఎందుకూ? – అన్ని మొగాలూ, ఒకటే – వేసుకునే ఫేసుపౌడరు తేడాలే కాని, పెళ్ళాం కన్న – కారు చవుకగా వచ్చే దేముందీ? – అన్నం, బట్ట – అంతకన్న ఆడదానిమీద వేస్టు చేయడం అనవసరం –" – నేను ఆ ప్రకారమే నడుచుకుంటున్నాను" "నేను – సానికన్న కూడా కనాకష్టమన్న మాట–'"

"పెళ్ళాం – పోనీ – ఆ తేడాలు, మరియాదలూ శాస్త్రానికి తెలియవు – దానికి కనబడేది రూ. అ. పైలు! –"

ఎరుగవ్వూ? –

ఎరుగనంటావా? – నీ మొగం! యెరుగక పోవడమేమిటి?

కందసామి కోవెల పక్కగా, యెదురు సందులో నాలుగిళ్ళు దాటిన మీదట – మందపాంటి మనిషి...అది సుందరమ్మ! – ఇంకా అవతల వందనం మేనకోడలోయ్ – పిల్ల – తల్లికంటె అందమైన మనిషి – అందరికీ అందదులే – అందులో ధర తగని గిరాకీ –

చూడలేదూ ఎప్పుడూ? – ఎదురుగుండా, మేడమీద గదిలో – మనవాడు – ఉంటూన్నప్పుడు? – సందు సందూ మనవాళ్ళక్రింద తెగ నలిగింది –

మనవాడు – డూఁ డూఁ బసవన్న! –

నేను – అంతకన్న శుద్ధ అన్నయ్యను!

ఇద్దరివైపూ ఒక మాదిరిగానే ఉంది, మొగ్గ! – చేసేది ఎంత పాడుపని అయినా, న్యాయఁ అంటూ ఉండాలి కదా? – కానీ యెగరేసి చూశాం – నావేపు చిత్తు – నా అవస్థ ఏదో తేలేదాకా, వాడు ఆ జోలికి పోరాదు; చూపైనా బెసగనీయురాదు – అది మరియాద: నోరెందుకు పారేసుకోవాలీ? – నలుగురిలో, నా ముందు అబద్ధం ఆడాడు – ముందుగా తన రొట్టే నేతిలో పడ్డదని –

అని యెలా రుజువు కావడం? –

కావలిస్తే పోయి అడగమన్నాడు – అప్పుడు తనమాట అబద్ధమైతే – ఏమన్నా పడతానన్నాడు.

అవును, అది ముందు తేల్చవోయ్! ఆమీద ఆలోచించవచ్చును, అలా నీ కన్న ముందుగా వాడు తొందరపడటం సబబవునో కాదో, అన్నారు విన్న మన వాళ్ళందరూ.

అది నా కెంత అవమానం –

అదివరదాకా – మాటాడేదాకా ।గంధం ముదరకపోయినా – ఆ వేడిమీద, లేని చొరవ తెచ్చుకొని – పోయి అడిగేశాను.

ఇంకా అదుపూ, ఆజ్ఞా మీరక తెరకు చాటుగా మెలిగే పిల్లను పట్టుకొని, అవునా, కాదా వాడికీ నీకూ నేస్తం? అని అడిగితే....నా పుణ్యం బాగుండిపోయి,

అసహ్యించుకుని, తలుపు అదిరేటట్టు వేసుకుంది కాని....అసలు వాళ్ళకు తెలిస్తే....తాడు గూడిపోదూ? – అందులో వాళ్ళ అత్తచేతి క్రింద. ...ఎంతమందికి? – గండుసాని...

వాడూ – నేను...బోణీ చేయాలంటే .... ఏ వీర బాహుడికో .... ఎనిమిదిసార్లు అమ్ముడు పోవాలి....అంత ధరకి....

"నిన్ను రమ్మన్నాది, నన్నూ రమ్మన్నాది: ఇద్దరినీ రమ్మంది, – నిద్దురోయిందీ...." గారడీవాడిపాట....

యిద్దరికీ ఆ గది విడచి యివతల పడేదాకా, నిద్దరేలేదు....ఇన్నాళ్ళైనా, అటు మనసుపోయి, నోరూరినప్పుడు, వాడికీ అసలే నిద్దుర పట్టదు – ఇప్పుడు, వాడికీ నాకూ ... గిట్టదు –

ఎరుగవూ? –

## 7

కలలో అయినా కత్తి మొగం చూడని ఘనగడ్డం, గళ్ళుకూడా మాసిపోయి చీలికవాలిక లాతూన్న కంబెమెడ లాల్చీ, బ్రహ్మకమ్మీకుట్ల బంగాలీ ధోవతీ, గుంటూరు నూతుల కన్నా లోతుకళ్ళూ, మళ్ళా – బ్రహ్మానుమించే వర్చసు:

ఆయనే ఆ కవి.

సొంతంగా చదివితే ఆ పద్యాలు ఎంతో బాగుంటాయి. విని తీరాలి.

అలాగా! ఇలా దయచేయండి, ఏమన్నా వినిపించండి....

కావ్య రసికుడు, ఖజానాకొట్టు నడవాలో నుంచి గాజుగ్లాసుతో చల్లని మంచినీళ్ళు స్వయంగా తెచ్చి అందించి సత్కరించాడు.

ఉసూరు మనేందుకన్నా ఓపిక లేదు.

లేకపోయినా, దేహాన్ని కుర్చీలోంచి లేపి ఎక్కడికన్నా జేరవేయకుండా, అక్కడే కూర్చోడం అంతకన్న బాగుండదు.

అంతకన్న బాగా చదివాడు, ఆయన పద్యాలు అవాళ బహిరంగ సభలో.

అందరి చేతులూ ఆయన మెళ్ళో గులాబీరేకల కన్న యెక్కువగా కందిపోయినవి. అన్ని చప్పట్లు ఆ ఊరు పుట్టిన తరువాత యెప్పుడూ వినలేదు.

అన్నం తిన్నారా? అని అడిగిన మారాజున్నాడా? కన్ను తెరిచి, కావ్యలోకంలో కథ నెత్తుకున్నప్పటినుంచీ యెన్నడూ యెవరూ వేయలేదు, ఆయన్ను ఆ ప్రశ్న.

ఉన్న రోజున తిన్నాడు.

ఉన్న రోజంటూ యెన్నడన్నా ఉన్నదా?

విన్నారా? అంత పండువెన్నెల రోజుల్లో, ఆయన తెల్లవారేసరికి, మల్లెపూవల్లే వాడిపోయినాడట!

అందరూ వేలూవందలూ పూలు పెట్టిన అందంగా కట్టించిన దండల్లో ఆయన నిండిపోయినాడు.

ఆకాశంలో వగలాళ్ళంతా; ఆకలంత ఆవేశంతో ఆయన్ను కౌగిలించుకున్నప్పుడు, ఆ మెళ్ళో దండలు వేయించిన ఆసామీల పేర్లు అడిగి కనుక్కోక పోతారా... అని అందరి దిలాసా;

కులాసాల్లో వెలిగిపోయే లోకం, ఆకాశంలోంచి అలాంటి కవి మళ్ళా యెప్పుడు ఊడిపడతాడా అని కాచుకుకూర్చుంది:

ఆకలి లేని లోకంలోంచి అవతరించే అపర భారతులు – మరి, అలాగయితే – అమృతం కుంభం వెంట తెచ్చుకోకుండా, అక్కడే వదిలిపెట్టి వచ్చి – యిక్కడ, చేతులో అణా అన్నా లేకుండా, అన్ని ఇబ్బందులూ పడవలసిన అవసరం ఏముంది? – అనే మొగరాయ డెవరన్నా మొలుచుకువస్తే – అమాంతంగా అతడే కవి అయి వూరుకున్నాడు, మరి:

అందుచేత, ఆ ప్రశ్నకు అప్పటికీ యిప్పటికీ జవాబు రానేరాదు: కాయం నిలిచినన్నాళ్ళూ బాధా, యాతనా పోదు.

చివరపంక్తి .... తల ఊపుతో ఆ చివరనుంచి యీ చివరకు ఒక్క విసురున మళ్ళాచదివి, మనసులో శహబాసుగా తల ఊగించుకుంటూ, చివర చుక్క ఒత్తుగా దిద్ది, కలం గిరవాటువేసి బల్లకు కాళ్ళు ఎగదన్ని, కుర్చీ రెండుకాళ్ళ మోపుమీద ఊపుగా వెనుకకు వ్రాలాడు: గమగమలాడే కాఫీ త్రాగాడు: ముద్దులు కురుస్తూ, ముంగురులతో ఆడుకుంటూన్న యిల్లాలి చెక్కిలికో బుల్లి జెల్లాయిచ్చేసి....బెల్లింపుగా ప్రణయ కజ్జాతో కారు వచ్చేదాకా కాలక్షేపం చేశాడు:

హారన్ మోగింది: కారు ఢ్రాంయ్‌కి వెనుక సీటు క్రిక్కిరిసి ఊగింది: యిల్లాలి తల రేగింది.

అలసటగా యిద్దరూ బీచిలో అలల అంచున అడుగుతీసి అడుగు వేస్తున్నారు:

ఆ యిల్లాలు దిక్కులు చూస్తూంది, అతడు ఇంకో కథ ఆలోచిస్తున్నాడు....

"ఎవరండీ ఆయన? అలా వెర్రిగా....యెక్కడికో అవతలికి అదేపనిగా చూస్తున్నాడు?"

"అదే పని....ఆయనకు!"

"అంటే..."

"ముందు అడుగు పడనీ: ఆనక చెపుతాను: నా గొంతు విన్నాడా అంటే, తంటసంలాగా తగులుకుని వదలడు: ఇప్పుడు తన పద్యాలు విన మంటాడు...."

"అంటే...కవన్నమాట....పాపం"

అని బిగ్గరగా అనుకుంది యిల్లాలు....వాళ్ళ ఆయన వ్రాసుకుంటూన్నంత సేపూ అక్కడ కక్కడ ఆ వ్రాత చదివిన పాపాన....

కోపం తెప్పించుకోబోయే మొగం చేసుకుని....గాలికి వెన్నిచ్చి కథకాయ్ మరో గోల్డుఫ్లేక్ ముట్టించాడు.

నడి సముద్రంలో ఆకాశం గుండె బ్రద్దలుగా ఉరిమింది.

కాళ్ళు మోకాళ్ళు మీరి తడిసిన కవిలో కావ్యం కురిసింది.

కథకాయ్ ..... జగజగా కారెక్కి, రెక్కమూసుకున్నాడు.

..... ఏది కథ?

* * *